మామయ్య కోరిక



గుడిసేవ సుందర రామయ్య

'సీతారావుడూ... నన్ను కూడా ఓసారి విమాన మెక్కించరా!'

అయిదేళ్ళక్రితం మామయ్య నాతో అన్న మాటలు గుర్తుకు వచ్చి నా కళ్ళు చెమ్మగిల్లాయి.

పైలట్ ఆఫీసర్‌గా నాకు వుద్యోగం వచ్చిందని తెలియగానే మామయ్య కోరిన మొదటి కోరిక అది. నాకు తెల్సినంతలో మామయ్య ఎప్పుడూ ఎవ్వరినీ ఏదీ కోరేవాడు కాదు. కోరవలసిన అవసరం కూడా ఆయనకు లేదు. అంతే కాదు! పదిమంది కోరికలు తీర్చగల శక్తి, సామర్థ్యాలు ఆయనకున్నాయి.

మామయ్య వాళ్ళది నెల్లూరుకు దగ్గర్లో వున్న ఓ పల్లెటూరు. ఆ వూళ్ళో మామయ్య మకుటంలేని మహారాజులా చెలామణి అయ్యాడు. అక్కడ రకరకాలైన కులాలవాళ్ళున్నారు. పేదవాళ్ళున్నారు. గొప్పవాళ్ళున్నారు. అయినా అంతా మామయ్యనే గౌరవిస్తారు, అభిమానిస్తారు, ఆరాధిస్తారు. అందుక్కారణం ఆయన అలవర్చుకొన్న ఉన్నతమైన వ్యక్తిత్వమే. ధనవంతులెందరో వూరినంతట్నీ తమ గుప్పెట్లో పెట్టుకోవాలని ఎంతో ప్రయత్నించి విఫలమయ్యారు.

మామయ్యకు ఊహ తెల్సేనాటికే తాతయ్య పదెకరాల మాగాణి భూమిని, ఇరవై ఎకరాల మెట్టభూమిని రూపాయిలుగా మార్చి తాగేశాడు. మామయ్యకు ఆయన వదిలివెళ్ళిన ఆస్తి కేవలం రెండెకరాల మాగాణి, పదివేల అప్పు. అలాంటి దుర్భర పరిస్థితుల్లో మామయ్య సంసార బాధ్యతలను స్వీకరించాల్సివచ్చింది. అదే సమయంలో అమ్మ, పెద్దమ్మలకు పెళ్ళి చేయాల్సిన బాధ్యతకూడా ఆయన మీదే పడింది. ఆ పరిస్థితులను తల్చుకోటానికే భయం వేస్తోంది.

మరి... మామయ్య ఆ రోజుల్లో ధైర్యంగా నిలబడి పరిస్థితులను ఎదుర్కొని, తన బరువు బాధ్యతలను నల్గురూ మెచ్చుకునేట్లుగా నిర్వర్తించాడంటే అందుక్కారణం ఆయన ఆత్మస్థైర్యం, పట్టుదల, కృషి అని చెప్పాలి.

సెకండరీస్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న రేణుకయ్యగారికి పెద్దమ్మనిచ్చి వివాహం చేశాడు. ఆ తర్వాత షావుకారుదగ్గర తాతయ్య లోగడ చేసిన పదివేల అప్పుకు వడ్డీకట్టి ఆ బాకీక్రింద పెద్దలనాటి పెంకుటిల్లును, విశాలమైన స్థలంతోసహా జమకట్టి ఋణవిముక్తుడయ్యాడు.

అన్నీపోగా ఆయనకు మిగిలిన ఆస్తి రెండెకరాల మాగాణిభూమి, పెళ్ళికి ఎదిగివున్న మా అమ్మ. అదృష్టంకొద్దీ మాగాణిభూమి వూరికి ఆనుకొనే వుండటంచేత చేలోనే రెండు నిట్టాళ్ళ పాక వేయించాడు. చేలోనే ఓ చిన్న చెరువు త్రవ్వించాడు.

ఇరవై సంవత్సరాలైనా నిండకమునుపే అరక చేతధరించి భూమినే నమ్ముకొని ధైర్యంగా నిలబడిన మామయ్యను చూడగానే పెద్ద పెద్ద రైతులు సహితం ఆశ్చర్యపోయారు 'వ్యవసాయం సంగతి ఈ కుర్రవాడికేం తెల్సు?' అని హేళన చేసినవాళ్ళున్నారు.

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుందంటారు రైతు బిడ్డంటే అలా వుండాలి. వృద్ధిలోకి వస్తాడు!' అని మెచ్చుకున్నవాళ్ళూ వున్నారు.

భూసారపు స్వభావాన్ని గుర్తించి, వ్యవసాయంలోవున్న మెళకువలను తెల్సుకొని, సకాలంలో నాట్లు వేయించి, తగు రీతిలో నీటిని మళ్లలో నిల్వవుంచి ఆ వూళ్ళో అందరికంటె

మామయ్య కోరిక

ఎక్కువ దిగుబడిని సాధించకల్గాడు మామయ్య. తనకున్న రెండెకరాలను చేయటంతో తృప్తిపడ లేదు. చేనుకు ఆనుకొనివున్న మరో అయిదెకరాల మాగాణిని కౌలుకు తీసుకొన్నాడు. అంతకు మునుపు అయిదు బస్తాలుకూడా పండని ఆ బంజరుభూమిని సాగుచేసి రెండేళ్లలో ఎకరానికి ఇరవై బస్తాల దిగుబడినిచ్చే బంగారు భూమిగా మార్చేశాడు.

మామయ్య ఏ చేలో కాలుపెడితే ఆ చేలో బంగారం పండుతుందనే భావన వూరి ప్రజలకు కల్గింది. ఎంతోమంది రైతులు తమ పొలాలను కౌలుకు తీసుకోమని, అవసరమైతే కావాల్సిన పెట్టుబడిని కూడా పెడతామని మామయ్య వెంటపడ్డారు.

శక్తికి మించిన భారాన్ని మోయటానికి సిద్ధపడ్డాడు మామయ్య సాగుచేయాల్సిన పొలం ఎక్కువ కావటంతో కొన్ని నూతన పద్ధతులను ప్రవేశపెట్టాల్సిన అవసరం కల్గింది. దగ్గర్లో వున్న నెల్లూరుకు వెళ్లి అక్కడ వ్యవసాయ శాఖాధికారులను కల్సుకొని అధిక దిగుబడినిచ్చే వరి రకాలను తెల్సుకొని తానే మొట్టమొదటి సారిగా ఆ వూళ్లో హైబ్రిడ్ రకాలను ప్రవేశ పెట్టాడు. ల్యాండ్ మార్టగేజ్ బ్యాంకుకు వెళ్లి తన భూమిని తాకట్టు పెట్టి ఓ ట్రాక్టర్‌ను కొన్నాడు.

ట్రాక్టర్ కొన్న దగ్గర్నుంచి మామయ్యకు బాగా కల్సివచ్చింది. కౌలుకు తీసుకొన్న భూములను దున్నటమే కాకుండా ట్రాక్టర్‌ను కిరాయి కొరకు ప్రక్క వూళ్లకు కూడా పంపే వాడు. దాంతో రాబడి విపరీతంగా పెరిగింది. ధనధాన్యాలతో, పాడిపంటలతో మామయ్యవాళ్ల లోగిలి కళకళలాడుతూ వుండేది. చేలోనే ఇటుక తీయించి చక్కని బిల్డింగ్‌కూడా కట్టించాడు మామయ్య.

మామయ్య జీవితంలో వ్యవసాయానికి ఎంత ప్రాధాన్యతనిచ్చినా సంసారపు బాధ్యతలను ఏనాడూ విస్మరించలేదు. అమ్మకు గొప్ప సంబంధం చూసి పెళ్లి చేయమని ఎంతోమంది మామయ్యకు సలహానిచ్చారు. కాని మామయ్యకు తెల్సు అమ్మకు తమ మేనమామ కొడుకును పెళ్లి చేసుకోవాలనే వుద్దేశ్యం వున్నట్లు. అప్పట్లో నాన్నకు ఆస్తి ఓ మూడెకరాల మాగాణి మాత్రమే వుండేది. స్కూల్ ఫైనల్ వరకు చదివి వుండటంచేత నెల్లూరు దగ్గర్లోనే వున్న ఓ యి. డి. సబ్ పోస్టాఫీసులో పోస్టు మాస్టరు వుద్యోగం వచ్చింది. అయిదెకరాలు కట్నంగా యిచ్చి ఓ శుభ ముహూర్తాన మామయ్య అమ్మ పెళ్లిని ఘనంగా చేశాడు.

ఆదే సంవత్సరం మామయ్య కూడా పెళ్లి చేసుకొన్నాడు. అత్తయ్యది కూడా దగ్గర్లోవున్న పల్లెటూరే. అయితే వాళ్ల నాన్నగారు మాత్రం నెల్లూర్లో ఓ మిల్లును కంట్రాక్టుకు తీసుకొని ధాన్యవ్యాపారం చేసేవాడు. రైతుల ద్వారా మామయ్య గుణగణాలను తెల్సుకొని కన్యాదానం చేశాడాయన ...

నేను పుట్టేనాటికే మామయ్య ఇరవై ఎకరాల మాగాణికి ఆసామీ అయ్యాడు. నేను పుట్టిన అయిదేళ్లకు నాన్న చనిపోవటంతో అమ్మ మామయ్య దగ్గరకు వచ్చేసింది. స్కూల్ ఫైనల్ వరకు నేను మామయ్యవాళ్ల వూళ్లోనే చదువుకొన్నాను. నాతోపాటే మామయ్య పిల్లలు వాసు, గోపీ, సీత, రాజేశ్వరికూడా స్కూలుకు వచ్చేవారు. వాసు, గోపీలు కూడా స్కూలు ఫైనల్ పాసయ్యారు. ఆడపిల్లలు మాత్రం టెన్త్‌క్లాసుతో చదువు ఆపేశారు. మామయ్య ప్రోత్సాహంతోనే నేను నెల్లూరు కాలేజీలో జాయినయ్యాను. వాసు, గోపీలను కూడా కాలేజీ చదువులు చదివించాలనుకొన్నాడు మామయ్య. కాని అంతలోనే ఆకస్మాత్తుగా అత్తయ్య చనిపోవటం, మామయ్యకు ఉబ్బసం జబ్బు రావటం దురదృష్టకరమైన సంఘటలనే చెప్పాలి. తండ్రిని ఎంతో అభిమానించే గోపీ, వాసులు ఆయన్ని వదిలి నెల్లూరు వెళ్లి చదువు కోటానికి నిరాకరించారు. మామయ్యకూడా గట్టిగా చెప్పలేకపోయాడు. వాళ్లిద్దరూ మామయ్యకు వ్యవసాయంలో సాయంచేస్తూ వుండిపోయారు.

నేను ఎమ్. ఏ. పాసయ్యాక సీతను నాకిచ్చి వివాహం చేయాలనుకొన్నాడు మామయ్య. నా వుద్దేశం ఓ రోజున అడిగాడు. మొదట్నుంచీ ఆ యింట్లోనే పెరగటంచేత సీత, రాజేశ్వరిలను నేను తోబుట్టువులుగానే చూశాను అదీగాక కాలేజీలో చదువుకొంటుండగా నాకు అన్నపూర్ణతో పరిచయం అయింది. పెద్దలు అనుమతి యిస్తే ఆమెను వివాహం చేసుకోవాలనుకొన్నాను. మామయ్యకు ఆ విషయం ఎంతో బాధపడుతూ చెప్పాను నా మనసులోని మాటను ధైర్యంగా చెప్పినందుకు మామయ్య నన్ను అభినందించాడు తనే మాట్లాడి అన్నపూర్ణతో నా పెళ్లి జరిపిస్తా నన్నాడు.

నాకు పైలట్ ఆఫీసర్‌గా సెలక్షన్ రాగానే మామయ్యే పూనుకొని మా వివాహం జరిపించాడు. సీతను ఓ బ్యాంకు ఆఫీసర్‌కు, రాజేశ్వరిని ఓ కాలేజీ లెక్చెరర్‌కు యిచ్చి వివాహాలు జరిపించాడు. ఆ తర్వాత గోపీ, వాసులక్కూడా సాంప్రదాయకమైన కుటుంబాల సంబంధాలనే చేశాడు.

కొడుకుల పెళ్లిళ్లతో మామయ్య సంసారపు బాధ్యతలను పూర్తిగా తీర్చుకొన్నట్లే! అయితే వయసు పెరిగినప్పటికీ ఆయన వ్యవసాయాన్ని అశ్రద్ధ చేయలేదు.

దుక్కులు దున్నించటం దగ్గర్నుంచి చేలను తడిపి వరినాట్లు వేయించటం, ఎరువులు చల్లించటం, కలుపులు తీయించటం, కోతలు కోయించటం, కుప్పలు వేయించటం చివరకు ధాన్యం నూర్పించి యింటికి తోలించి పురి కట్టించేవరకు మామయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవాడు. అలా కష్టపడటంచేతనే తన పిల్లలకు దారిద్ర్యం అంటుకోకుండా చూడకల్గాడు ఖర్చుపెట్టే ప్రతి పైసా మామయ్య కష్టార్జితమే! అందుకే అనవసరపు ఖర్చులు చేయటానికి యిష్టపడడు. నాకు తెల్సినంతవరకు మామయ్యకు జత బట్టలు తప్ప ఎప్పుడూ ఎక్కువ వుండవు. కొడుకులు, కూతుళ్లు కుట్టిస్తానంటే ఒప్పుకొనేవాడు కాదు.

'వయసు మళ్ళిపోయిన నాకెందుకురా యివన్నీ ! ఆ డబ్బుపెట్టి మీ పిల్లలకు కుట్టించుకోండి !' అనేవాడు. మామయ్య నిరాడంబరుడు. కష్టజీవి. కరుణార్ద్ర హృదయుడు. అందుకని మామయ్యంటే నాకెంతో యిష్టం. ఇంతమంది వున్నా మామయ్య ఒక్కగానొక్క కోరికను ఇంత వరకు తీర్చలేకపోయాం. మామయ్య కోరికను తీర్చే బాధ్యతను నేనే స్వీకరించాలనుకొన్నాను. ఎటూ దీపావళి రాబోతూంది ! ప్రతి దీపావళికి మామయ్యకు కూతుళ్లను, అల్లుళ్లను యింటికి పిలవటం అలవాటు. వాళ్లతోపాటు నన్ను, అన్నపూర్ణనుకూడా పిలుస్తుంటాడు మాలో ఎవ్వరు వెళ్లకపోయినా ఎంతో బాధపడతాడు.

ఆయన మనసు బాధ పెట్టడం ఎవరికీ యిష్టంలేదు కనుక ఎన్నిపనులున్నా మానుకొని మేమంతా పండక్కి మామయ్య వాళ్ల వూరు వెళ్లక తప్పటంలేదు.

మామయ్య ఇంతకు ముందు కలకత్తా చూడలేదు కాబట్టి దసరా పండక్కి యిక్కడకు వస్తే అందరం కల్సి దీపావళికి మామయ్య వాళ్ల వూరు వెళ్లొచ్చు. అప్పుడు మద్రాసు వరకు మామయ్యను ఫ్లయిట్‌లో తీసుకు వెళ్లొచ్చు అనుకొన్నాం నేను, అన్నపూర్ణ. ఆ విషయమే మామయ్యకు వుత్తరం రాశాను. వారంరోజులకే మామయ్య దగ్గర్నుండి వుత్తరం వచ్చింది. చేలలో దోమకాటు ఎక్కువుగా వుందని తను దసరాకు రావటానికి వీలుపడదని దీపావళి ముందు వస్తానని జవాబు రాశాడు.

మామయ్య యిక్కడకు వచ్చి నాల్గురోజులైంది. ఈ నాల్గు రోజుల్లో మామయ్యను కార్లో కలకత్తా అంతా త్రిప్పాము అన్నపూర్ణ, నేను. కాళికాదేవాలయం, రామకృష్ణ మఠం, బిర్లా ప్లానిటోరియమ్, విక్టోరియా మ్యూజియమ్, హౌవ్రాబ్రిడ్జ్ మొదలగు ముఖ్య ప్రదేశాలను చూపించాము.

మామయ్య ఎంతో సంతోషించాడు.

'నా జన్మలో ఈ కలకత్తా నగరాన్ని చూస్తాననుకోలేదురా అబ్బీ !' అన్నాడు మామయ్య ఎంతో కృతజ్ఞతతో.

అంతలోనే అన్నపూర్ణ అందుకొని 'అంతే కాదు బాబాయ్ ! మీ మేనల్లుడు మిమ్మల్ని

ఎల్లుండి విమానం ఎక్కించబోతున్నారు !'' అంది.

''ఏరా ! అమ్మాయి చెప్పేది నిజమేనా ?'' అంటూ నన్నడిగాడు.

''నిజమే మామయ్యా ! ఎంతో కాలం నుంచి నీ మనసులో మిగిలిపోయిన కోరికను తీర్చాలను కొంటున్నాను. మనం ముగ్గురం ఎల్లుండి ఫ్లయిట్‌లో మద్రాసువెళ్లబోతున్నాం..''

''నాకు చాలా ఆనందంగా వుందిరా! అసలు విమానం ఎక్కాలన్న కోరిక నాకు చిన్నప్పట్నుంచీ వుండేది. ఆకాశంలో స్వేచ్ఛగా పక్షిలా ఎగురుతున్న విమానం కన్పించగానే అది కనుమరుగయ్యే వరకు అలానే చూస్తూండిపోయేవాణ్ణి ! పెద్ద చదువులు చదివి నేను కూడా విమానంలో ప్రయాణం చేయాలనుకొన్నాను. నాన్న చనిపోవడంతో నా కలలన్నీ కల్లలయ్యాయి.

మీ పెద్దమ్మ వాళ్లు రాజమండ్రిలో వుండగా గోదావరి పుష్కరాలు వచ్చాయి. ఆ సందర్భంలో రాజమండ్రి చుట్టూ తిప్పటానికి విమానాన్ని ఏర్పాటు చేశారు. ఓ రోజు మేమంతా గోదావరిలో స్నానం చేసి విమానం ఎక్కాలనుకొన్నాం. స్నానవాటికలో మీ పెద్దమ్మ కొడుకు హరి తప్పిపోయాడు. రెండ్రోజులయిన తర్వాత పోలీసుస్టేషన్లో వాడు దొరికాడు ఆ హడావుడిలో విమానం ఎక్కాలన్న వుత్సాహమే పోయింది ఆనాటి నుంచి విమానం ఎక్కాలన్న కోరిక నా మనసులో మరుగున పడసాగింది. అయితే నీకు పైలట్‌ఆఫీసర్ వుద్యోగం రాగానే నా కోరిక కొత్త వూపిరిని పోసుకొంది. ఆ కోరిక త్వరలో తీరబోతుందన్నమాట ! చాలా సంతోషం !''

ఆ మాటలంటున్నపుడు మామయ్య కళ్లు ఆనందంతో మెరిశాయి. ఆ కళ్లలో అంతులేని సంతృప్తిని, కృతజ్ఞతను నేను చూడకల్గాను. కాని ...

ఇంతలోనే ఎంతటి ఘోరం... జరిగిపోయింది ... —''ఏమండీ ! బాబాయి కళ్లు తెరిచాడు'' అన్న అన్నపూర్ణ మాటలు వినగానే వరండాలో కుర్చీలో కూర్చుని గతాన్ని నెమరు వేసుకొంటున్న నేను వర్తమానంలోకి వచ్చాను.

కుర్చీలోంచి గబగబ లేచి మామయ్య వున్న గదిలోకి వెళ్లాను.

బెడ్‌మీద మామయ్య పండుకొని వున్నాడు. గుండెలవరకు దుప్పటి కప్పుకొన్నాడు.

గుమ్మంలో నన్ను చూడగానే దగ్గరకు రమ్మని చేత్తో సైగచేశాడు.

నేను మంచం దగ్గరకు వెళ్లి మామయ్య తల దగ్గరే కూర్చున్నాను.

''ఏం మామయ్యా ! ఎలా వుంది ?'' అని అడిగాను.

''ఆయాసంగా ... వుందిరా...'' అన్నాడు ఓ చేత్తో గుండెను రుద్దుకొంటూ.

''డాక్టర్‌గారొచ్చి ఇంజక్షన్ చేసి వెళ్లారు మామయ్యా ! నీకు మెలకువ రాగానే తెలియ జేయమన్నారు. అన్నపూర్ణ డాక్టర్‌గారికి ఫోన్ చేయటానికి వెళ్లింది. కాస్సేపట్లో డాక్టరుగారొస్తారు !'' అన్నాను.

''పిల్లలంతా ... వచ్చే వుంటారు ... మనూరికి వెళ్దాంరా !'' ఆయాస పడుతూనే అన్నాడు

''నీవు ధైర్యంగా వుండు మామయ్యా ! నీ ఆరోగ్యం బాగయ్యాక మనమంతా కల్సే వెళ్దాం ! ... ''

అలా కాదన్నట్లు చేత్తో సంజ్ఞ.

కొన్ని నిమిషాలు నా కళ్లల్లోకి అలానే చూస్తూండిపోయాడు. మామయ్య అలా చూస్తుంటే నాకెంతో విచారం కల్గింది సూర్య గోళమంత ప్రకాశవంతమైన ఆనాటి మామయ్య కళ్లు ఈనాడు బిత్తర చూపులు చూస్తున్నాయి. సింహంలా బ్రతికిన మామయ్య యిలా చితికి పోయాడేమిటన్న భావం కల్గగానే నా మనసులో దుఃఖం ఆగలేదు.

నా కళ్లలో నీళ్లు చూడగానే మామయ్య కూడా కంట తడిపెట్టాడు.

వణుకుతున్న చేతులతో నా చేతిని తన చేతుల్లోకి తీసుకొన్నాడు.

''సీతారావుడూ .. నన్ను. .మనూరిలోనే. . మట్టి చేస్తారుకదూ...''

ఆ మాటలు వింటుంటే నా గుండెల్లో దడ ఏర్పడింది మామయ్య పరిస్థితి క్షణ క్షణానికి క్షీణించసాగింది. అన్నపూర్ణ, నేను డాక్టర్‌కోసం ఎదురు చూటడం మినహా ఏమీ చేయలేకపోయాం !

కాని .. కాని... డాక్టర్ వచ్చేవరకు మామయ్య ఆగలేదు.

* * *

విధి ఇంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తుందని కలలోకూడా వూహించలేదు నేను.

జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదగగల్గిన మామయ్య. . ఈనాటికి... ఆకాశంలో . విమానమ్మీద స్వేచ్ఛగా వాయువులు పీల్చుకొంటూ ప్రయాణం చేస్తాడనుకొన్నాను

కానీ ...

జరిగిందేమిటి ?

విమాన ప్రయాణం చేసింది ఆత్మను విడిచిన ఆయన శరీరం మాత్రమే !

ఎయిర్‌పోర్ట్‌లో బంధుమిత్రులంతా మామయ్యకు ఘనంగా స్వాగతం చెప్పాలనుకొని వుత్సాహపడ్డారు. కాని... వారి వుత్సాహం... విషాదంగా మారింది. ఠీవిగా తలెత్తి నడిచివచ్చే మామయ్య మెడలో వేయాల్సిన పూలదండలను— ట్రాలీమీద మెల్లగా తీసుకువస్తున్న ఆయన శవపేటికమీద వుంచాల్సి వచ్చింది విధి వైపరీత్యం అంటే ఇదేనేమో ! ★

అంకితం

మూడేళ్ల క్రితం మమ్మల్నందర్నీ విడిచి వెళ్లిన మామయ్యకు.

— గుడిపేవ సుందరరామయ్య

1983 లో మా ఫలితాలు భవిష్యత్తుకు హామీనిస్తాయి!

BANK CLERKS — 84% **APPSC — 86%**

BANK CLERKS, P.Os, APPSC Gr II (B), Gr IV

ఇంజనీరింగ్, మెడికల్, నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ కాలేజి

ఎంట్రన్సు క్లాసులు ప్రారంభమైనవి. ఫోన్ : 74636

STUDIES 'N' EXAMS ACADEMY

మాచవరం, విజయవాడ 520 004

ADWAVE